సాక్షి పెద్దపల్లి

శనివారం । 13 । జనవరి । 2024



అయోధ్య అక్షింతల పంపిణీ

పెద్దపల్లిరూరల్: పట్టణంలో అయోధ్య రాముడి అక్షింతలను పంపిణీ చేశారు. ఆర్యవైశ్య మహిళలు స్వాగతం పలికారు.



లక్ష్య సాధనకు కృషి

గోదావరిఖని: వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యాల సాధనకు కృషి చేయాలని ఆర్జీ–1 జీఎం శ్రీనివాస్ సూచించారు. జీడీకే–5 ఓసీపీని ఆయన శుక్రవారం సందర్శించారు.

గరిష్టం/కనిష్టం
32.0/17.6

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండగా ఉంటుంది. ఉదయం, సాయంత్రం చలితీవ్రత పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పల్లె బ్రదర్స్‌కు అభినందనలు



అభినందిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

రామగుండం: ఉన్నత విద్య అభ్యసించి వ్యవసాయ రంగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తున్న రాయదండి గ్రామానికి చెందిన పల్లె శ్యాం, పల్లె రాజు(పల్లె బ్రదర్స్)ను కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ప్రశంసించారు. శుక్రవారం తన చాంబర్‌లో పూలమొక్క అందజేసి అభినందించారు. సొంత కృషితో నాటుకోళ్ల హెచరీస్ ఏర్పాటు చేసి రైతులకు పెంపకంపై శిక్షణ ఇచ్చి, ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. కృత్రిమ పద్ధతిలో వందలాది గుడ్లను ఒకేదశలో పొదిగి, పిల్లలను ఉత్పత్తి చేసే ఇంక్యూబెటర్ ఆవిష్కరించిన ఘనత పల్లెబ్రదర్స్‌కు దక్కిందని కలెక్టర్ ప్రశంసించారు.

పదోన్నతితో మరింత బాధ్యత



సిబ్బందితో సీపీ రెమా రాజేశ్వరి

గోదావరిఖని: పదోన్నతి ద్వారా మరింత బాధ్యత పెరుగుతుందని రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి అన్నారు. పదోన్నతి పొందిన కమిషనరేట్ పరిధిలోని 8మంది ఎస్సైలు, 10మంది ఏఎస్సైలు, 19మంది హెడ్ కానిస్టేబుళ్లను ఆమె తన కార్యాలయంలో అభినందించారు. ఉద్యోగులు, సిబ్బంది క్రమశిక్షణతో సేవలు అందిస్తూ, ప్రజల్లో నమ్మకం, గౌరవం పెంచేలా పనిచేయాలని ఆమె సూచించారు. కష్టపడి పనిచేసిన వారికి మంచిగుర్తింపు లభిస్తుందని సీపీ అన్నారు. కార్యక్రమంలో పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు బోర్ల కుంట పోచలింగం తదితరులు పాల్గొన్నారు.

వ్యసనాలు వీడండి



ర్యాలీ నిర్వహిస్తున్న కార్యకర్తలు

జ్యోతినగర్(రామగుండం): ఆధునిక ఆధ్యాత్మికవేత్త స్వామి వివేకానంద అని హిందూవాహిని రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల రాజన్న అన్నారు. వివేకానంద జయంతి సందర్భంగా ఎన్టీపీసీ అన్నపూర్ణకాలనిలోని చిలుకలయ్య దేవాలయ హాల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యువత వ్యసనాలను వీడి సమాజోద్ధరణకు పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో ప్రతినిధులు కాంతాల సంతోష్‌రెడ్డి, రాగం శ్రీధర్, శ్రీకాంత్, శివ, మిట్టపల్లి సతీశ్‌కుమార్ పాల్గొన్నారు.

స్వయం సమృద్ధి సాధించాలి



కోర్సులు ప్రారంభిస్తున్న జీఎం శ్రీనివాస్

గోదావరిఖని: మహిళలు స్వయం స్వావలంబన సాధించాలని ఆర్జీ–1 జీఎం శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం స్థానిక సీఈఆర్ క్లబ్‌లో వృత్తి శిక్షణ కోర్సులను ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సింగరేణి ప్రభావిత చందనాపూర్, సింగిరెడ్డిపల్లి, దుబ్బపల్లి గ్రామాల నిరుద్యోగ యువతులకు టైలరింగ్, మగ్గం వర్క్స్, ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నామని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అధికారులు సీహెచ్ లక్ష్మీనారాయణ, శ్రావణ్‌కుమార్, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ అరెల్లి పోశం, చందనాపూర్ సర్పంచ్ దాసరి శంకరయ్య, సీనియర్ పీవో శ్రావణ్‌కుమార్, సేవా సమితి కో ఆర్డినేటర్ మేడి తిరుపతి, కమ్యూనికేషన్ సెల్ కో ఆర్డినేటర్ నగునూరి రవికుమార్ పాల్గొన్నారు.

18న జాబ్‌మేళా

పెద్దపల్లిరూరల్: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 18న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధికల్పనాధికారి తిరుపతిరావు తెలిపారు. హైదరాబాద్ కృషి విజ్ఞాన ఫెర్టిలైజర్స్ కంపెనీలో పనిచేసేందుకు ఎంబీఏ హెచ్ఆర్ మేనేజ్‌మెంట్, బీఎస్సీ అగ్రికల్చర్, డిప్లొమా, డిగ్రీ విద్యార్హతలు గలవారు జాబ్‌మేళాకు హాజరు కావాలని సూచించారు. పూర్తి వివరాలకు సెల్ నంబరు 89853 36947, 95026 42441 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

ఖాకీల పొలిటికల్ ఫండింగ్



మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో రామగుండం కమిషనరేట్ పరిధిలోని బీఆర్ఎస్ నేతలకు కొందరు ఎస్సైలు నిధులు సమకూర్చారు. ఇందులో పెద్దపల్లికి చెందిన పోలీసు పైరవీకారు ఒకరు మధ్యవర్తిగా వ్యవహరించారు. సదరు నేతలు ఎన్నికల్లో విజయం సాధిస్తే తమ సీట్లు పదిలంగా ఉంటాయని వారు ఇలా అత్యుత్సాహం చూపించారు. కానీ, గులాబీ నేతలు ఓటమి చవిచూడడం.. కాంగ్రెస్ నాయకులు విజయం సాధించడంతో ఎస్సైలు కంగుతిన్నారు. బాగోతం బయట పడడంతో తమకు బదిలీ తప్పదని అంచనా వేస్తూ.. చేబదులుగా ఇచ్చిన సొమ్మును తిరిగి ఇప్పించాలని మధ్యవర్తిపై ఒత్తిడి తెస్తున్నారు. ఆనోటాఈనోటా ఈ విషయం బయటకు పొక్కడంతో పొలిటికల్ ఫండింగ్‌పై ఇంటలిజెన్స్ రంగంలోకి దిగి ఆరాతీయడం సంచలనం రేపుతోంది.

- అసెంబ్లీ ఎన్నికల్లో నేతలకు నిధులు
- మధ్యవర్తి ద్వారా సమకూర్చిన పోలీసులు
- ఆరా తీస్తున్న ఇంటలిజెన్స్ అధికారులు
- ఆందోళనలో సదరు పోలీస్ అధికారులు

సాక్షి, పెద్దపల్లి: ఎన్నికల వేళ వివిధ పార్టీల తరపున పోటీచేసే అభ్యర్థులకు రియల్ ఎస్టేట్ వ్యాపారులు, బడా బిజినెస్‌మెన్, పారిశ్రామిక దిగ్గజాలు ఎన్నికల ఖర్చు కోసం నిధులు సమకూర్చుతారు. కానీ, రామగుండం కమిషనరేట్ పరిధిలోని పలువురు పోలీస్ అధికారులు ఏకంగా నిధులు సమకూర్చడం సంచలనం రేపుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించినవారు.. అలాంటి వారి విషయాన్ని పోలీస్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఇంటలిజెన్స్ రంగంలోకి దిగింది. నిధులు సమకూర్చిన వారిపై ఆరా తీస్తోంది. జిల్లా పోలీసు శాఖలో ఇది చర్చనీయాంశంగా మారింది.

ఏం చేయాలో తెలియక..

- సిఫారసు లేఖలతో పోస్టింగ్‌లు పొందిన పోలీసులు, మళ్లీ ఆ నేతలే గెలుస్తారని నమ్మకంతో తమ పోస్టింగ్‌లు నిలుపుకోవాలనే అభిప్రాయంతో పెద్దపల్లికి చెందిన ఓ పైరవీకారుతో బీఆర్ఎస్ నేతలకు డబ్బులు సమకూర్చారు.
- ఇప్పుడు ప్రభుత్వం మారడం, తాము మద్దతు తెలిపిన నాయకులు ఓడిపోవడం, మరోపక్క ఇంటెలిజెన్స్ ఆరా తీస్తుండటంతో వారికి ఏంచేయాలో పాలుపోవడంలేదు.
- ఫండింగ్ చేసిన నేతలు, మధ్యవర్తి డబ్బుల వాపస్ గురించి నోరు మెదపకపోవడంతో తమ బాధ ఎవరికి చెప్పుకోవాలో తెలియక బాధితులు సతమతమవుతున్నారు.

నేతల చుట్టూ ప్రదక్షిణలు

ప్రభుత్వాలు మారినప్పుడు బదిలీలు అనివార్యం. ఎస్సై నుంచి ఏసీపీల స్థాయి వరకు అధికారుల పోస్టింగులు ఎమ్మెల్యేలు, మంత్రుల కనుసన్నలోనే జరుగుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలోని మూడు స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులే విజయం సాధించడం, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరడంతో పోలీసు అధికారులు పునరాలోచనలో పడ్డారు. దీంతో గెలిచిన ఎమ్మెల్యేలను ప్రసన్నం చేసుకునేందుకు పలువురు పోలీస్ అధికారులు వరుసకడుతున్నట్లు తెలుస్తోంది. అయితే, ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులకు ఫండింగ్ చేసిన సదరు పోలీసులపై ఎమ్మెల్యేలు అసంతృప్తితో ఉన్నారని తెలిసింది. బీఆర్ఎస్‌కు అనుకూలంగా ఉంటూ ప్రతిపక్ష నాయకులతో కఠినంగా వ్యవహరించారన్న విమర్శలు ఎదుర్కొంటున్నారు. అందులో కొందరు అత్యుత్సాహం చూపుతూ ఓ పోలీస్ పైరవీకారు ద్వారా ఏకంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు ఎన్నికల్లో ఫండింగ్ చేసి ఆర్థికంగా సాయం చేసినవారున్నారు. వారందరినీ సమూలంగా మార్చి తమకు అనుకూలమైన వారిని తీసుకొచ్చే యోచనలో ప్రస్తుత ఎమ్మెల్యేలు ఉన్నారు. దీంతో గతంలో తాము పనిచేసిన ప్రాంతాల్లో పరిచయం ఉన్న కాంగ్రెస్ నేతలను కలిసి తమకు అవకాశం కల్పించాలని బాధిత పోలీసు అధికారులు కోరుతున్నారు. మరికొందరు తమకు అవకాశం ఇచ్చిన నేత గెలవలేదని, ప్రభుత్వం మారిపోయిందని ఆవేదనలో ఉన్నారు. ప్రస్తుతం దూర ప్రాంతాల్లో ఏళ్లుగా లూప్‌లైన్‌లో పనిచేస్తున్న పలువురు పోలీసు అధికారులు కాంగ్రెస్ నేతల సహకారంతో జిల్లాకు రావడానికి ఆసక్తి చూపుతున్నారని తెలుస్తోంది.

మంత్రి శ్రీధర్‌బాబుపైనే ఆశలు

- నేడు అభివృద్ధి పనులపై సమీక్ష



మంథని: ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు శనివారం మంథని నియోజకవర్గ పర్యటన ఖరారయింది. స్థానిక క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌తోపాటు జిల్లా, డివిజన్ స్థాయి అధికారులతో ఆయన అభివృద్ధి పనులపై సమీక్షిస్తారు. మంథని మున్సిపల్‌లో ఏళ్లుగా డంపింగ్ యార్డుకు స్థలం కొరత, సామాజిక వైద్యశాలకు పక్కా భవనం, వంద పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ అలాగే ఉండిపోయాయి. మాతా శిశు ఆస్పత్రికి ముంపు సమస్య, పూర్తిస్థాయి వైద్యులు, సిబ్బంది నియామకం ఇప్పటికీ కాలేదు. పీజీ కళాశాల డిమాండ్‌గా మిగిలిపోయింది. చిన్న కాళేశ్వరం, పోతారం ఎత్తిపోతల నిర్మాణంపై ఈ ప్రాంత రైతులు ఎంతోఆశతో ఎదురుచూస్తున్నారు. సింగరేణితోపాటు ఇతర ప్రాజెక్టులకు భూసేకరణ సమస్య పరిష్కారం కావడంలేదు. వీటితోపాటు మరెన్నో సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత మంత్రి శ్రీధర్‌బాబు మంథని నియోజకవర్గ సమస్యలపై తొలిసారి కలెక్టర్, ఇతర శాఖలతో సమీక్ష నిర్వహించనుండడంతో పరిష్కారం లభిస్తుందని నియోజకవర్గ ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ప్రారంభోత్సవాలు.. అభివృద్ధి పనులు

మంత్రి శ్రీధర్‌బాబు ఉదయం 8 గంటలకు రామగిరి మండలం కల్వచర్ల గ్రామ పంచాయతీ, ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం ప్రారంభించనున్నారు. ఉదయం 9.30గంటలకు మంథని మున్సిపల్‌లోని గంగాపురి శివారులో నిర్మించిన ఎస్ఆర్ సినిమా థియేటర్ ప్రారంభిస్తారు. 10 గంటలకు క్యాంపు కార్యాలయంలో కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తారు. ఆ తర్వాత కలెక్టర్, అధికారులతో సమస్యలపై సమీక్షలో పాల్గొంటారు. మధ్యాహ్నం 12 గంటలకు నాగారం గ్రామపంచాయతీ కార్యాలయం, కమ్యూనిటీహాల్, సిమెంట్ రోడ్డు ప్రారంభిస్తారు. ఆ తర్వాత మల్హర్ మండలం కొయ్యూర్ నుంచి కాటారం, మహదేవపూర్ మండలాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే విజయోత్సవ ర్యాలీల్లో మంత్రి శ్రీధర్‌బాబు పాల్గొంటారు.

వంతెన పనులు ప్రారంభించండి

- ఆర్ అండ్ బీ మంత్రికి గోనె ప్రకాశ్‌రావు విన్నపం



రామగుండం/సుల్తానాబాద్/పెద్దపల్లిరూరల్: అంతర్గాం–మంచిర్యాల గోదావరి నదిపై హైలెవల్ వంతెన పనులు సత్వరమే ప్రారంభించాలని బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాశ్‌రావు కోరారు. ఈ మేరకు రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని శుక్రవారం హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈనెల 8న 'సాక్షి'లో 'వారధి..జాడేది?' శీర్షికన కథనం ప్రచురితమైన విషయం విదితమే. గతేడాది జూన్ 9న వర్చువల్ విధానంతో అప్పటి సీఎం కేసీఆర్ మంచిర్యాలలో వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేశారని గోనె ప్రకాశ్‌రావు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వంతెన నిర్మాణానికి రూ.164 కోట్లు కేటాయిస్తూ టెండర్ల ప్రక్రియ పూర్తికాగా 2023 అక్టోబర్ 6న వల్లభనేని కన్‌స్ట్రక్షన్ కంపెనీ పనులు దక్కించుకుందన్నారు. వంతెన నిర్మాణానికి అనవసరమైన మట్టి నమూనా పరీక్షలు, సాంకేతిక అంశాలు చేపట్టారని, ప్రస్తుతం కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా బ్యారేజీలలో వరద నీటిని వదలిపెట్టడంతో వంతెన నిర్మాణానికి అనువుగా ఉంటుందని, పనులను శరవేగంగా నిర్దేశిత గడువులోగా పూర్తిచేసేందుకు అవకాశం ఉంటుందని, వీటిపై పరిశీల చేయాలని మంత్రికి విన్నవించినట్లు వివరించారు. మంత్రి సానుకూలంగా స్పందించారని గోనె తెలిపారు. అంతర్గాం వంతెన నిర్మాణం పూర్తయితే కరీంనగర్ నుంచి మంచిర్యాలకు 30 కిలోమీటర్ల దూర భారం తగ్గుతుంది.

వివేకానందను స్ఫూర్తిగా తీసుకోండి



నివాళి అర్పిస్తున్న అధికారులు

పెద్దపల్లిరూరల్: యువత స్వామి వివేకానంద ఆశయ సాధనకు పాటుపడాలని, ఆయన స్ఫూర్తితో ముందుకు సాగాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం స్వామి వివేకానంద జయంతి సందర్భంగా యువజన, క్రీడాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయ యువజన దినోత్సవంలో అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. భారతదేశ ఖ్యాతిని ఖండాంతరాలకు చాటిచెప్పిన మహనీయుడు వివేకానంద అని అన్నారు. యువత వివేకానంద చూపిన బాటలో నడవాలని కోరారు. జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఉపన్యాస, వ్యాసరచన పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. డీవైఎస్‌వో సురేశ్‌తోపాటు రవి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం

- ముస్కాన్, స్మైల్‌తో పటిష్ట చర్యలు
- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



మాట్లాడుతున్న కలెక్టర్, అధికారులు

పెద్దపల్లిరూరల్: బాలలతో పనులు చేయించే వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవడంతోపాటు బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం మహిళా, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం ద్వారా నిర్వహించిన ఆపరేషన్ స్మైల్ సమన్వయ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. బాల కార్మికులను గుర్తించి వెట్టిచాకిరీ నుంచి విముక్తి కలిగించడానికి స్వచ్ఛంద సంస్థల సహకారంతో ముదుకు సాగాలని సూచించారు. బాలల పరిరక్షణ కోసం ఏర్పాటు చేసిన బృందాలు నిరంతరం తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. బాలకార్మికులను గుర్తించిన వారు టోల్‌ఫ్రీ నంబరుకు 1098కు సమాచారం ఇవ్వాలని కోరారు. బాలలతో పనిచేయించడం నేరమని అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ అన్నారు. వెట్టిచాకిరీ చేయించే యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం పోస్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో బాలలపరిరక్షణ కమిటీ చైర్మన్ శ్రీధర్, అనిల్, మైనార్టీ సంక్షేమాధికారి మెహరాజ్, రంగారెడ్డి, తిరుపతిరావు, మాధవి, కల్పన, ప్రవీణ్, మధుసూదనచారి, నాగలైశ్వర్, సురేశ్, షేక్ పాల్గొన్నారు.

జీజీహెచ్ సందర్శన



ఢిల్లీ బృందానికి వివరాలు వెల్లడిస్తున్న సిమ్స్ ప్రిన్సిపాల్ హిమబిందుసింగ్

కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖనిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)ని ఢిల్లీ నుంచి వచ్చిన ఎన్టీపీసీ, సీఎస్ఆర్–సీడీ సంస్థకు చెందిన బిజినెస్ ఎక్స్‌లెన్స్ ప్రతినిధుల బృందం శుక్రవారం సందర్శించింది. ఆస్పత్రి అభివృద్ధి కోసం ఎన్టీపీసీ 2022–23 ఆర్థిక సంవత్సరానికి సీఆర్ఎస్–సీడీ కింద సుమారు రూ.10కోట్లు వెచ్చించింది. ఈ నిధులతో ఆస్పత్రి భవనం పైఅంతస్తు నిర్మాణం చేపట్టడంతోపాటు లేబర్ రూం, ఆపరేషన్ థియేటర్, హైరిస్క్‌వార్డు, ఎస్ఎన్‌సీయూ, ఇన్‌పేషెంట్ల వార్డుల్లో స్కానింగ్ మిషన్, బెడ్స్, టేబుళ్లు తదితర మెడికల్ ఎక్విప్‌మెంట్లు ఉచితంగా అందజేసింది. బృదంలోని ముఖ్య ప్రతినిధి వినీత్ శర్మతోపాటు హెఆర్ విభాగానికి చెందిన అధికారి చారి ప్రభుత్వ ఆస్పత్రిలోని అన్ని విభాగాలను పరిశీలించారు. తాను గుర్తించిన వివరాలు అన్నింటినీ నమోదు చేసుకున్నారు. అనంతరం సిమ్స్ ప్రిన్సిపాల్ హిమబిందుసింగ్‌తో ఆమె కార్యాలయంలో సమావేశయ్యారు. భవిష్యత్‌లో ఆస్పత్రి అభివృద్ధికి మరింత సహకారం అందించాలని ప్రిన్సిపాల్ హిమబిందుసింగ్ వారిని కోరారు. రామగుండం ఎన్టీపీసీ సీఎస్ఆర్ విభాగం అధికారి యుగేందర్ తదితరులు పాల్గొన్నారు.

'దోపిడీ కోసమే విద్యుత్ కేంద్రాలు'



ఎమ్మెల్యే ఠాకూర్‌ను సన్మానిస్తున్న ప్రతినిధులు

రామగుండం: దోపిడీ కోసమే వనరులు లేని యాదాద్రిలో గత పాలకులు విద్యుత్ కేంద్రాలు స్థాపించారని, రామగుండంలోని బీ–థర్మల్ విద్యుత్ కేంద్రంపై చిన్నచూపు చూశారని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ విమర్శించారు. స్థానిక బీ–థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. సూపరింటెండెంట్ ఇంజినీర్ పి.విజేందర్, ప్రతినిధులు శంకరయ్య, శ్రీనివాస్‌రావు ఆయనకు స్వాగతం పలికి శాలువా, పుష్పగుచ్ఛంతో సన్మానించారు. తొలుత విద్యుత్ కేంద్రం భూములు, కొత్త ప్రాజెక్టు స్థాపనకు అనుకూలతలు తదితర అంశాలపై ఇంజినీర్లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, బీ–థర్మల్‌కు 700 ఎకరాలు, బీపీఎల్‌కు చెందిన 1,900 ఎకరాల్లో కొత్త పరిశ్రమల స్థాపించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఉమ్మడి ఏపీలో వెలుగులు పంచిన బీ–థర్మల్ స్థానంలో కొత్త ప్రాజెక్టు స్థాపనే తన లక్ష్యమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని కొబ్బరికాయ కొట్టించేందుకు తీసుకువస్తానని ఆయన స్పష్టం చేశారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

- మున్సిపల్ కమిషనర్‌కు కార్పొరేటర్ల వినతి



వినతిత్రం అందిస్తున్న కార్పొరేటర్లు, నాయకులు

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లోని అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని బీఆర్ఎస్ కార్పొరేటర్లు, నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ నాగేశ్వర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పట్టణ ప్రగతి నిధులతో వివిధ డివిజన్లలో తాగునీరు, సీసీ రోడ్లు, యూజీడీ తదితర అభివృద్ధి పనులు చేపట్టడానికి కౌన్సిల్‌లో తీర్మానం చేశారన్నారు. అలాగే టీయూఎఫ్ఐడీసీ నిధుల ద్వారా వివిధ డివిజన్లలో అభివృద్ధి పనులు చేపట్టడానికి ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం కలెక్టర్‌కు ప్రతిపాదనలు కూడా పంపించారని, అసెంబ్లీ ఎన్నికల కోడ్‌తో ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. వెంటనే కలెక్టర్ చొరవ తీసుకొని సంబంధిత అధికారులతో చర్చించి నిధులు విడుదల చేయించడంతోపాటు డివిజన్లలో అభివృద్ధి పనులకు వేగవంతం చేయించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో కార్పొరేటర్లు ధాతు శ్రీనివాస్, ముదాం శ్రీనివాస్, పులేందర్‌తోపాటు నాయకులు బొడ్డు రవీందర్, నగునూరి రాజు, గాదం నందు, దుబాసి మల్లేశ్ ఉన్నారు.

ముక్కు మూసుకోవాల్సిందే..!

- రహదారుల చెంతనే చెత్త డంపింగ్
- కంపుకొడుతున్న శివారు కాలనీలు
- డంపింగ్ యార్డులేక అవస్థలు
- స్థలం కేటాయింపే అసలు సమస్య
- మంథని బల్దియాలో పారిశుధ్యం పరిస్థితి ఇది..



మంథని-కాటారం రోడ్డు పక్కనే చెత్తకుప్పలు

మంథని: మున్సిపల్‌లో చెత్త డంపింగ్ యార్డు సమస్య ప్రజలు, అధికారులను వేధిస్తోంది. ఇంటింటా సేకరించిన చెత్తను మంథని – కాటారం – గోదావరిఖని మార్గాల్లో రోడ్లపైనే పడవేయడంతో పట్టణ శివారులు కంపుకొడుతున్నాయి. ఆ మార్గాల్లో ముక్కు మూసుకోకుండా రాకపోకలు సాగించడం అసాధ్యంగా మారాయి. స్థానిక మాతా శిశు ఆరోగ్య కేంద్రం సమీపంలోనే చెత్త డంప్ చేయడంతో పేషెంట్లు, వారి బంధువులకు తీవ్ర అసౌకర్యం కలుగుతోంది. దోమలు, ఈగలు, బ్యాక్టీరియా వృద్ధి చెంది స్థానికులు వ్యాధుల బారినపడుతున్నారు. కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్నాక గతేడాది జూలై 20న తొలిసారి ముజమ్మిల్‌ఖాన్ మాతా శిశు ఆరోగ్య కేంద్రం సందర్శించారు. ఆ సమయంలో చెత్త డంపింగ్ సమస్యను అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆర్నెల్లు గడుస్తున్నా సమస్యకు పరిష్కారం లభించలేదని ఆవేదన చెందుతున్నారు.

ఏళ్లుగా పెండింగ్‌లోనే..

- అధికారిక లెక్కల ప్రకారం బల్దియాలో సుమారు 21,500 పైచిలుకు జనాభా ఉంది. అనధికారింగా మరో 15వేల మంది ఉంటారు.
- దాదాపు 40వేల జనాభా ఉండే మంథని మున్సిపాలిటీలో 13 వార్డులు ఉన్నాయి.
- బల్దియా సిబ్బంది ఇంటింటా నిత్యం చెత్త సేకరిస్తున్నారు.
- ఇందుకోసం 20 రిక్షాలు, 6 స్వచ్ఛ ఆటోలు, 4 ట్రాక్టర్లు, 45మంది కార్మికులను అధికారులు కేటాయించారు.
- వీటిద్వారా రోజూ ఇంటింటా సుమారు 8 టన్నుల చెత్త సేకరిస్తున్నారు.
- ఇలా సేకరించిన చెత్తను డంపింగ్ యార్డులో వేసి రీసైక్లింగ్ చేయాల్సి ఉంది.
- కానీ, చెత్త డంపింగ్ యార్డుకు స్థల కేటాయింపు ఏళ్లుగా పెండింగ్‌లో ఉంది.

కమ్ముకుంటున్న పొగ

పట్టణంలో సేకరించిన చెత్తను రోడ్డు పక్కనే పడవేస్తున్నారు. చాలా సందర్భాల్లో ఈ చెత్త కాలిపోవడంతో పొగ కమ్ముకొని రహదారులు కనిపించడం లేదు. ఆ సమయాల్లో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.

అధికారులకు విన్నవించినా..

- డంపింగ్ యార్డుకు స్థలం కేటాయించాలని రెవెన్యూ, అటవీ శాఖ అధికారులకు బల్దియా ఏళ్లుగా విన్నవిస్తూ వస్తూనే ఉంది.
- అయినా, వినతులుకు స్పందించిన దాఖలాలు లేనేలేవు.
- కాటారం మార్గంలోని ఎక్లాస్‌పూర్ సమీప గాడుదలగండి వద్ద రిజర్వు ఫారెస్టులో ఐదెకరాలు కేటాయించాలని మున్సిపల్ పాలకవర్గం, అధికారులు జిల్లా అటవీ అధికారికి ఇటీవల వినతిపత్రం పంపించారు.
- రాష్ట్ర అటవీ శాఖకు సైతం విన్నవించారు.
- ప్రస్తుతం చెత్త పోస్తున్న స్థలాన్ని కలెక్షన్ పాయింట్‌గా వినియోగించుకొని అటవీ శాఖ స్థలం కేటాయిస్తే డంపింగ్ యార్డు నిర్మించాలని మున్సిపల్ ప్రణాళిక సిద్ధ చేసింది.
- కానీ, స్థలం కేటాయింపులో సాంకేతిక సమస్య ఎదురవడంతో ఆ స్థలం చేజారింది.
- మంథని మండలం బిట్టుపల్లి, కాకర్లపల్లి గ్రామాల వద్ద స్థలం చూపించగా స్థల కేటాయింపులో సమస్య తలెత్తింది.

పొగ కమ్మేస్తుంది



నిత్యం వివిధ పనుల కోసం మంథనికి వస్తం. పట్టణ శివారు రోడ్డుపై వేసే చెత్తతో దుర్వాసన భరించలేకపోతున్నం. చెత్త కాల్చినప్పుడు వచ్చే పొగ రోడ్డును కమ్మేస్తున్నది.

– మంథని శ్రీనివాస్, ఎక్లాస్‌పూర్

ప్రయత్నిస్తున్నాం



డంపింగ్ యార్డు స్థలం కేటాయింపు కోసం ప్రయత్నాలు చేస్తున్నాం. కలెక్టర్ ఇప్పటికే రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీచేశారు. త్వరలోనే సమస్యకు పరిష్కారం లభిస్తుంది.

– మల్లికార్జున్, మున్సిపల్ కమిషనర్

- తాజాగా మంథని మండలం ఖానాపూర్ గ్రామ శివారు సమీపంలో రెవెన్యూ స్థలం గుర్తించగా తమ గ్రామ సమీపంలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేయవద్దని గ్రామస్తులు ఇటీవల ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో అధికారులకు ఫిర్యాదుచేశారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ట్రినిటి విద్యార్థి



రోహిత్‌ను అభినందిస్తున్న చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి

కరీంనగర్: సిద్దిపేట జిల్లా కొండపాక సోషల్ వెల్ఫేర్ (బాలికల) స్కూల్‌లో ఈనెల 13,14వ తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ట్రినిటి కళాశాల విద్యార్థి ఎ.రోహిత్ ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు నారాయణ తెలిపారు. శుక్రవారం కళాశాలలో జరిగిన సమావేశంలో రోహిత్‌ను ట్రినిటి కళాశాలల వ్యవస్థాపకుడు దాసరి మనోహర్‌రెడ్డి, చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కె.సంపత్, అధ్యాపకులు అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

క్యాంపస్ డ్రైవ్‌లో 'శ్రీచైతన్య' విద్యార్థులకు ఉద్యోగాలు



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

తిమ్మాపూర్(మానకొండూర్): మండలంలోని మహాత్మానగర్‌లో గల శ్రీచైతన్య ఇంజినీరింగ్ కళాశాల ఎంబీఏ- 2024 బ్యాచ్‌కు చెందిన నలుగురు విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. హెచ్‌డీఎఫ్‌సీ ఇన్సూరెన్స్ కంపెనీ ఇటీవల నిర్వహించిన ఆన్‌లైన్ క్యాంపస్ డ్రైవ్‌లో ఎగ్జిక్యూటివ్ ట్రైనీ ఉద్యోగాలకు ఎంపికయ్యారని విద్యాసంస్థల చైర్మన్ ముద్దసాని రమేశ్‌రెడ్డి తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు వార్షిక వేతనం రూ.4.75 లక్షలు ఉంటుందని కంపెనీ ప్రతినిధి పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ఎంపికైన విద్యార్థులు కంపెనీలో ఉద్యోగ నియామకాలకు కట్టుబడి ఉండాలన్నారు. ఈసందర్భంగా విద్యార్థులను సీడీసీ ఇన్‌చార్జి టి.వినయ్ తదితరులు అభినందించారు.

18 నుంచి డీసెట్ రెండో విడత వెబ్ ఆప్షన్స్‌కు అవకాశం

తిమ్మాపూర్(మానకొండూర్): డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్‌లో ఉత్తీర్ణులై ఇప్పటికే సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేసుకున్న విద్యార్థులకు ఈనెల 18 నుంచి 22 వరకు రెండో విడత వెబ్ ఆప్షన్ ఎంపికకు అవకాశం కల్పిస్తున్నట్లు డైట్ ప్రిన్సిపాల్ మొండయ్య తెలిపారు. మొదటి విడతలో సీటు పొంది స్లైడ్ కావాలనుకునే వారు కూడా ఆప్షన్ పెట్టుకోవచ్చని పేర్కొన్నారు. ఇక ఇప్పటికే సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేసుకున్న ఉమ్మడి కరీంనగర్ జిల్లా విద్యార్థులు ఈనెల 17న ఎల్‌ఎండీ కాలనీలోని డైట్ కళాశాలకు రావాలని సూచించారు.

యాజమాన్యమే చెల్లించాలి

గోదావరిఖని: కోలిండియా మాదిరిగా పెర్క్స్‌పై ఇన్‌కంట్యాక్స్‌ను యాజమాన్యం చెల్లించేలా చూడాలని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ డిప్యూటీ సీఎం, ఎనర్జీమంత్రి భట్టి విక్రమార్కను కోరారు. ఈమేరకు శుక్రవారం లేఖ రాసినట్లు పేర్కొన్నారు. ప్రకృతికి విరుద్ధంగా బొగ్గు పొరల్లోకి వెళ్లి ప్రాణాలను పణంగా పెట్టి బొగ్గు ఉత్పత్తి చేసుకున్న కార్మికులకు ఎంతచేసినా తక్కువే అన్నారు. ఈవిషయంలో చొరవ తీసుకుని వెంటనే అమలు చేసేలా చూడాలన్నారు.

చిరుత కదలికలపై నిఘా

- సత్తక్కపల్లి అటవీప్రాంతంలో మూడు ట్రాప్ కెమెరాలు ఏర్పాటు
- గండి హనుమాన్ ఆలయ సమీపంలో రహదారి దాటుతూ వెళ్లినట్లు అధికారులకు సమాచారం



అటవీప్రాంతంలో ట్రాప్ కెమెరాలు బిగిస్తున్న అధికారులు

మెట్‌పల్లిరూరల్(కోరుట్ల): మెట్‌పల్లి మండలం సత్తక్కపల్లి శివారు ప్రాంతంలో చిరుత కదలికలపై అటవీశాఖ అధికారులు నిఘా పెట్టారు. శుక్రవారం గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో మూడు ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేశారు. మరోమారు పలు చోట్ల గాలింపు చేపట్టగా చిరుత సంచరించినట్లు ఎక్కడా పాదముద్రలు కనిపించలేదు. మొన్నటి వరకు తిరిగిన ప్రాంతంలో సైతం పాదముద్రలు కనిపించకపోవడంతో ఈ ప్రాంతంలోనే ఉందా.. లేదా వేరే చోటుకు వెళ్లిందా అని అనుమానిస్తున్నారు. అటవీప్రాంతంలో గస్తీ కాస్తున్న సమయంలోనే జిల్లా సరిహద్దు శివారులోని గండి హనుమాన్ ఆలయ సమీపంలో ఓ దాబా దాటిన తర్వాత జాతీయ రహదారిని దాటుతూ అటవీ ప్రాంతం వైపు చిరుత వెళ్లినట్లు అక్కడున్న వారి ద్వారా అధికారులకు సమాచారం అందినట్లు తెలిసింది. దీంతో కమ్మర్‌పల్లి అటవీ ప్రాంతంలోకి చిరుత వెళ్లినట్లు భావిస్తున్నామని ఓ అధికారి తెలిపారు. కార్యక్రమంలో మెట్‌పల్లి ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని అధికారులు పాల్గొన్నారు.

బోయినపల్లిలో కార్యదర్శుల ఘర్షణ

ఎంపీవో ఎదుటే వాదులాట



తెగిన బంగారు గొలుసు చూపిస్తున్న కార్యదర్శి శేఖర్

బోయినపల్లి(చొప్పదండి): ప్రజాపాలన దరఖాస్తుల గల్లంతు విషయంలో ఇద్దరు పంచాయతీ కార్యదర్శులు ఎంపీవో ఎదుటే ఘర్షణ పడ్డ సంఘటన శుక్రవారం బోయినపల్లి మండల పరిషత్‌లో చోటుచేసుకుంది. సెలవులో ఉన్న మర్లపేట గ్రామపంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్ బాధ్యతలను నర్సింగాపూర్ పంచాయతీ కార్యదర్శి శేఖర్‌కు అప్పజెప్పారు. మర్లపేటలో వచ్చిన ప్రజాపాలన దరఖాస్తుల వివరాల ఆన్‌లైన్ త్వరగా పూర్తి చేయించాలనే ఉద్దేశంతో గతంలో ఉన్న కార్యదర్శి లక్ష్మణ్‌కు అప్పజెప్పారు. రెండు కౌంటర్ల డాటా ఎంట్రీ పూర్తి చేశానని, మర్లపేట 3వ కౌంటర్‌లో 73 దరఖాస్తులు కనిపించడం లేదని లక్ష్మణ్ ఎంపీవో గంగాతిలక్‌తోపాటు, మర్లపేట ఇన్‌చార్జి కార్యదర్శి శేఖర్‌కు తెలిపాడు. క్యాష్‌బుక్ సైతం కనిపించడం లేదని పేర్కొన్నాడు. తాను మొత్తం దరఖాస్తులు ఇచ్చినట్లు శేఖర్ చెప్పాడు. ఈక్రమంలో శుక్రవారం తహసీల్దార్ ఆఫీస్‌కు వెళ్లిన ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ రవీందర్‌కు ఎంట్రీ చేసిన ఫామ్స్ కట్టల అడుగున మర్లపేట 3వ కౌంటర్‌కు సంబంధించిన 73 దరఖాస్తులు కనిపించడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. మధ్యాహ్నం ఎంపీడీఓ కార్యాలయంలో లక్ష్మణ్, శేఖర్ ఇద్దరు కార్యదర్శులతో ఎంపీఓ గంగాతిలక్ మాట్లాడే క్రమంలో ఘర్షణకు దిగారు. ఇంతలో లక్ష్మణ్, శేఖర్ కాలర్ పట్టుకోగా.. అతని మెడలోని బంగారు గొలుసు తెగింది. అక్కడే ఉన్న ప్రజాప్రతినిధులు, అధికారులు ఇద్దరిని సముదాయించి అక్కడి నుంచి పంపించారు. ఈ విషయమై ఎంపీడీవో రాజేందర్‌రెడ్డిని వివరణ కోరగా పంచాయతీ కార్యదర్శుల మధ్య గొడవ జరిగిన విషయం తెలిసిందని, పూర్తి వివరాలు ఎంపీవోతో తెలుసుకుని విచారణ చేపడతామన్నారు. దరఖాస్తులు మొత్తం భద్రంగా ఉన్నాయని ఆన్‌లైన్‌లో డాటా ఎంట్రీ చేశారని తెలిపారు.

తెలుగు రాష్ట్రాల సంస్కృతిని ప్రతిబింబించేది సంక్రాంతి



చిన్నారులకు భోగిపండ్ల వేడుకలు

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): తెలుగు రాష్ట్రాల సంస్కృతిని ప్రతిబింబించే పండుగ సంక్రాంతి అని 'సాక్షి' మీడియా సంస్థల ఏడీవీటీ డైరెక్టర్ కేఆర్‌పీ రెడ్డి అన్నారు. పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండల కేంద్రంలో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే కాల్వ రాంచంద్రారెడ్డి లీలావతి నిలయంలో వేదవ్యాస, క్రిసెంట్, సరస్వతి హైస్కూల్లో ముందస్తు సంక్రాంతి వేడుకల్లో భాగంగా చిన్నారులకు భోగిపండ్లు పోశారు. ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందించారు. నిర్వాహకుల ఆహ్వానం మేరకు కేఆర్‌పీ రెడ్డి వాట్సాప్ ద్వారా విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో హెచ్‌ఎంలు సదయ్య, సయ్యద్, ప్రసాద్, ఉమామహేశ్వర్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి బలవన్మరణం



కనుకయ్య (ఫైల్)

బోయినపల్లి(చొప్పదండి): ఆర్థిక ఇబ్బందులతో మండలంలోని నీలోజిపల్లి గ్రామానికి చెందిన గుండ్ల కనుకయ్య (47) శుక్రవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై మహేందర్ వివరాల ప్రకారం.. కనుకయ్య అప్పు చేసి నీలోజిపల్లి ఆర్‌అండ్‌ఆర్‌కాలనీలో ఇల్లు నిర్మించుకున్నాడు. భార్యకు చెప్పకుండా అప్పు చేశాడు. దీంతో ఇంట్లో గొడవలు అయ్యాయి. రెండునెలల కింద ఉపాధి కోసం కరీంనగర్ వెళ్లి ప్రైవేటు ఉద్యోగం చేసుకుంటూ భార్యాపిల్లలతో అక్కడే ఉంటున్నారు. ఆర్థిక ఇబ్బందుల బాధతో మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి కనుకయ్య నీలోజిపల్లిలోని ఇంటికి ఒక్కడే వచ్చాడు. అప్పులు ఎలా తీర్చాలనే మనోవేదనతో ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య మంగ, కుమారులు ఆదిత్య, నిఖిల్ ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

మనస్తాపంతో యువకుడు..

సిరిసిల్లటౌన్: ఇంటికి పెద్దదిక్కులైన తాత, నానమ్మలు చనిపోయిన మనస్థాపంతో ఓ యువకుడు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు. జిల్లా కేంద్రంలోని సర్దార్‌నగర్‌కు చెందిన సామల వీరేందర్(24) తాత, నానమ్మలు రెండేళ్ల క్రితం చనిపోయారు. అప్పటి నుంచి మనస్తాపంతో ఉంటున్న వీరేందర్ గురువారం రాత్రి ఇంట్లోనే ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని చనిపోయాడు. మృతుడు తల్లి సామల రమ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిరిసిల్ల టౌన్ సీఐ బి.ఉపేందర్ తెలిపారు. మృతుడి తండ్రి కూడా చాలా రోజుల క్రితమే చనిపోయాడు.

రోడ్డుపై నిలిచిన లారీ

పెద్దపల్లిరూరల్:పెద్దకల్వల వద్ద రాజీవ్ రహదారిపై శుక్రవారం ఓ లారీ సాంకేతిక లోపంతో నిలిచిపోయింది. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచి పోవడంతో సమాచారం అందుకున్న ట్రాఫిక్ పోలీసులు.. అక్కడకు చేరుకుని స్థానికుల సహకారంతో లారీని పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

షాపులపైకి దూసుకెళ్లిన ట్రక్కు

- సింగరేణి రిటైర్డ్ కార్మికుడికి గాయాలు
- పలు వాహనాలు, రెండు దుకాణాలు ధ్వంసం



షాపులపైకి దూసుకెళ్లి ఆగిన ట్రక్కు

గోదావరిఖని(రామగుండం): గోదావరిఖని బస్టాండ్ సమీపంలో రాజీవ్ రహదారిపై అదుపుతప్పిన ట్రక్కు దుకాణాలపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో సింగరేణి రిటైర్డ్ కార్మికుడికి గాయాలు కావడంతోపాటు పలు వాహనాలు ధ్వంసం అయ్యాయి. వన్‌టౌన్ ఎస్‌ఐ సౌజన్య కథనం ప్రకారం.. శుక్రవారం వేకువజామున ఎన్టీపీసీ వైపు నుంచి మంచిర్యాల వైపు వెళ్తున్న ట్రక్కు గోదావరిఖని బస్‌డిపో దాటిన తర్వాత అదుపుతప్పి ఎడమ వైపు వేగంగా దూసుకెళ్లింది. ఆ సమయంలో టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై కూర్చుని టీ తాగుతున్న సింగరేణి రిటైర్డ్ కార్మికుడు చొప్పరి మధునయ్యను ఢీకొట్టడంతో చేయి, కాలు విరిగాయి. అక్కడే ఉన్న మోటార్ సైకిల్, మున్సిపల్ చెత్తవాహనం, టిఫిన్ సెంటర్, మిర్చి బండిపైకి దూసుకెళ్లి ట్రక్కు ఆగిపోయింది. అయితే నిత్యం రద్దీగా ఉండే ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. బాధితుడి కుమారుడు చొప్పరి అజయ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై వివరించారు.

బాధ్యుడిపై చర్య తీసుకోవాలి: ఎమ్మెల్యే

ప్రమాదానికి బాధ్యుడైన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ డిమాండ్ చేశారు. శుక్రవారం సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. అన్నివిధాలా ఆదుకుంటామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే వెంట మేయర్ బంగి అనిల్‌కుమార్, కమిషనర్ ఉన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



ఇటీవల కల్వర్టు పైనుంచి కిందపడిన కృష్ణ

ధర్మపురి: ఓ యువకుడు ఆస్పత్రిలో చికిత్సపొందుతూ గురువారం రాత్రి మృతిచెందినట్లు ఎస్సై దత్తాత్రి తెలిపారు. వివరాలు.. బుగ్గారం మండలం గోపులా పూర్ గ్రామానికి చెందిన కండ్ల కృష్ణ (38) కొద్దిరోజుల నుంచి తన భార్య గంగజల గ్రా మం తుమ్మెనాలలో ఉంటూ ధర్మపురిలోని ఓ గ్యాస్ ఏజెన్సీలో పని చేస్తున్నాడు. ఈనెల 1న నేరెల్ల గ్రామ శివారులో కల్వర్టుపై కూర్చొని ఉండగా మూర్ఛవ్యాధితో కింద ప డటంతో తీవ్ర గాయాలైనాయి. వెంటనే హైదరా బాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా మృతిచెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు కూతుర్లు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

వెల్గటూర్‌లో వృద్ధుడు..



లచ్చయ్య(ఫైల్)

వెల్గటూర్(ధర్మపురి): చికిత్స పొందుతూ ఓ వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం .. మండల కేంద్రానికి చెందిన గట్ల లచ్చయ్య (62) ఇటీవల అయ్యప్ప మాల ధరించాడు. అల్పాహారం నిమిత్తం వెల్గటూర్‌లోని ఓ భక్తుడి ఇంటికి వెళ్లాడు. అల్పాహారం ముగించుకొని రాత్రి సమయంలో మెట్లు దిగుతుండగా ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడి తీవ్ర గాయాలపాలయ్యాడు. వెంటనే జగిత్యాల ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించి, మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ నిమ్స్‌లో చేర్పించగా చికిత్సపొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతుడి భార్య అనసూర్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్వేత తెలిపారు.

ట్రాఫిక్ ఎస్సైతో దురుసు ప్రవర్తన

- మద్యం మత్తులో బీజేపీ నేత హంగామా



ట్రాఫిక్ ఎస్సైతో వాగ్వాదం చేస్తున్న నాగరాజు

జ్యోతినగర్(రామగుండం): మద్యం మత్తులో ట్రాఫిక్ ఎస్సైపై దురుసుగా ప్రవర్తించిన సప్ప నాగరాజు, మేకల నారాయణలపై ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. వివరాలిలా ఉన్నాయి. మేడిపల్లి సెంటర్‌లో ట్రాఫిక్ ఎస్సై ఉదయ్‌కిరణ్ తన సిబ్బందితో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీ చేపట్టారు. అటుగా వచ్చిన ఇద్దరిని నిలిపి బ్రీత్ అనలైజర్‌తో పరీక్షించేందుకు యత్నించారు. అందుకు నాగరాజు నిరాకరించాడు. అంతేకాదు.. ఎస్సైతోపాటు విధినిర్వహణలోని నిర్వహణలో ట్రాఫిక్ సిబ్బంది, ఓ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధిపై నాగరాజు, మేకల నారాయణ దురుసుగా ప్రవర్తిండంతోపాటు దూషించారు. ఘటన స్థలానికి చేరుకున్న ఎస్సై జీవన్.. నిందితులను పోలీసుస్టేషన్‌కు తరలించారు. తనపై దురుసుగా ప్రవర్తించడం, దూషించడంతోపాటు విధి నిర్వహణను ఆటంకపరిచాడని ఎస్సై ఉదయ్‌కిరణ్ చేసిన ఫిర్యాదు మేరకు నాగరాజు, నారాయణపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు వివరించారు.

వృద్ధురాలి మెడలో చైన్ అపహరణ



బాధితురాలు రుద్రారపు పోచవ్వ



తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని జిల్లెల్ల గ్రామంలో చైన్‌స్నాచర్లు రెచ్చిపోయారు. బైక్‌పై వచ్చి వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసును లాక్కెళ్లారు. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు. జిల్లెల్ల గ్రామానికి చెందిన రుద్రారపు పోచవ్వ(65) రేషన్ షాపునకు వెళ్తుండగా బైక్‌పై వచ్చిన ఇద్దరు పోచవ్వ మెడలోంచి మూడు తులాల బంగారు గొలుసును లాక్కెళ్లారు. ఈ ఘటనలో పోచవ్వ మెడకు స్వల్పంగా గాయమైంది. గ్రామంలోని సీసీ కెమెరాలలో బైక్‌పై వెళ్తున్న చైన్‌స్నాచర్ల దృశ్యాలు రికార్డయ్యాయి. బైక్‌పై ఒక పురుషుడు, ఒక మహిళ ఉన్నారు. బాధితురాలి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కానిస్టేబుళ్లకు గాయాలు

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ మేడిపల్లి సెంటర్ రాజీవ్ రహదారిపై శుక్రవారం సాయంత్రం రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. మంచిర్యాల జిల్లాకు చెందిన కానిస్టేబుళ్లు మహేందర్‌కు కుడి చేతి మణికట్టుకు, కల్యాణ్‌కు కుడి చేతికి, ఎల్కలపల్లి గ్రామానికి చెందిన సాయిరాంకు ఎడమ కాలుకు గాయాలయ్యాయి. వారిని 108 వాహనం ద్వారా స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు.

ముందస్తు సంబురం







ముత్యాల ముగ్గులు.. ఆవు పేడతో చేసిన గొబ్బెమ్మలు.. వాటి మధ్య నవధాన్యాలు.. రేగుపండ్లు.. డూడూ బసవన్నలు.. హరిదాసుల కీర్తనలు.. ఎగిరే గాలిపటాల సందడులు.. వెరసి ఆ ప్రాంతమంతా సంక్రాంతి సంబురం. జిల్లా కేంద్రంలోని ట్రినిటి పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో శుక్రవారం ముందస్తు సంక్రాంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. భోగి మంటల నడుమ నృత్యాలు చేస్తూ ఆనందంగా గడిపారు విద్యార్థులు, ఉపాధ్యాయులు. మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యాసంస్థల చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి విద్యార్థులతో కలిసి సందడి చేశారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి



రామగుండంలో సింగరేణి సీఎండీ పర్యటన



గోదావరిఖని: సింగరేణి సీఎండీగా బాధ్యతలు చేపట్టిన ఎన్.బలరాం తొలిసారి శుక్రవారం అర్ధరాత్రి రామగుండం రీజియన్‌లోని ఇల్లెందు గెస్ట్ హౌస్‌కు చేరుకున్నారు. తొలుత ఓసీపీ, భూగర్భ గనిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడి కార్మికులతో మాట్లాడారు. అనంతరం ఇక్కడే బసచేసి శనివారం సింగరేణి ఏరియా ఆస్పత్రి క్యాంటీన్ పరిశీలించనున్నారు. సింగరేణి ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న స్కిల్ డెవలప్‌సెంటర్ పనుల పురోగతి పరిశీలించనున్నారు. సీఎండీ పర్యటన నేపథ్యంలో అధికారులు అప్రమత్తమైయ్యారు. గనులు, ఓసీపీల్లో పలు జాగ్రత్త చర్యలు చేపట్టారు.

ఆటో బోల్తాపడి గాయాలు

మంథని: మంథని–ఖమ్మంపల్లి ప్రధాన రహదారిపై ధర్మారం సమీపంలో శుక్రవారం ఆటో అదుపుతప్పి బోల్తాపడిన ఘటనలో పదిమంది గాయపడ్డారు. ముత్తారం మండలం సీతంపేటకు చెందిన నూనె రామయ్య తన ఆటోను జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలం తాడిచర్ల నుంచి మంథనికి ప్రయాణికులతో బయలు దేరాడు. మార్గమధ్యంలో ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో డ్రైవర్‌తోపాటు మరో తొమ్మిది మంది గాయపడ్డారు. గాయపడిన వారిలో తాడిచర్లకు చెందిన ఇందారపు లావణ్య, అగ్గిమల్ల రమ, మల్లమ్మ, విజయ, మోహన్, ముత్తారం మండలం శుక్రవారంపల్లికి చెందిన గజ్జలవేణి రజిత, రాజ్‌కుమార్, జిల్లెలపల్లికి చెదనపేట సదయ్య, సండ్రెల్లికి చెందిన మేకల గట్టయ్య ఉన్నారు. వీరందరినీ మంథని సామాజిక వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స అందించి కరీంనగర్ తరలించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రామగుండం: హైదరాబాద్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మన్‌గా పనిచేసే వ్యక్తి శుక్రవారం ఉత్తరప్రదేశ్‌లోని స్వగ్రామానికి వెళ్తూ రైలులు అస్వస్థతకు గురయ్యాడు. చికిత్సకు తరలించే క్రమంలో మృతిచెందిన ఘటన రామగుండంలో చోటుచేసుకుంది. జీఆర్పీ ఔట్‌పోస్టు ఇన్‌చార్జి గంగారపు తిరుపతి కథనం ప్రకారం.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం బాలియా జిల్లా మహ్మద్‌పూర్ గ్రామానికి చెందిన భీం ప్రసాద్ (66) హైదరాబాద్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం తన స్వగ్రామానికి వెళ్లేందుకు సికింద్రాబాద్‌లో రైలు ఎక్కాడు. ప్రయాణంలో ఒక్కసారిగా విరోచనాలు, జ్వరం, జలుబుతో స్పృహ కోల్పోయాడు. తోటి ప్రయాణికులు గుర్తించి రామగుండం రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. రైలు రామగుండం చేరే సరికి 108 వాహనం సిద్ధంగా ఉంచారు. రైలు రాగానే బాధితుడిని గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందించేలోగా మృతిచెందాడు. మృతదేహాన్ని గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపర్చారు. మృతుడి కుటుంబసభ్యులకు సమాచారం అందించినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకొన్నట్లు వారు వివరించారు.

కానిస్టేబుల్‌పై కేసు

గోదావరిఖని: తండ్రిని పట్టించుకోని కానిస్టేబుల్‌పై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్సై సమ్మయ్య తెలిపారు. స్థానిక బస్టాండ్ కాలనీకి చెందిన తండ్రి సింగరేణి రిటైర్డ్ కార్మికుడు అర్నకొండ అంజయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీస్ కానిస్టేబుల్ అర్నకొండ సదానందంపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. రూ.20లక్షలు నగదు, నాలుగు తులాల బంగారం, 20తులాల వెండి ఆభరణాలు, బస్టాండ్ కాలనీలోని ఇల్లు, రెండు ఎకరాల భూమిని భయపెట్టి గిఫ్ట్‌డీడ్ కింద రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని తండ్రి తెలిపాడు. తన ఆస్తినంతా తీసుకొని బాగోగులు చూసుకోవడం లేదని అంజయ్య పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

'యూనియన్ భవనం తొలగిస్తే ఆందోళన తప్పదు'

కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్) ఆవరణలోని ఏఐటీయూసీ అనుబంధ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయ భవనం తొలగిస్తే ఆందోళనలు తప్పవని ఆ యూనియన్ నాయకులు హెచ్చరించారు. శుక్రవారం జీజీహెచ్ మెడికల్ సూపరింటెండెంట్ దయాల్‌సింగ్, సిమ్స్ ప్రిన్సిపాల్ హిమబిందుసింగ్‌కు ఏఐటీయూసీ నగర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంఏ గౌస్, సమితి నాయకుడు శనగల శ్రీనివాస్ వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆస్పత్రి ఆవరణలో 20 సంవత్సరాల క్రితం మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ కోసం నిర్మించిన భవనాన్ని క్రిటికల్ కేర్ యూనిట్ నిర్మాణం కోసం కూల్చివేయాలని చూస్తున్నారని, ఈ యత్నాన్ని విరమించుకోవాలని కోరారు. ఆస్పత్రిలోని కార్మికులు, ఉద్యోగుల హక్కుల పరిరక్షణ, వారి సంక్షేమం కోసం యూనియన్ కార్యాలయాన్ని ఉపయోగిస్తున్నట్లు తెలిపారు. యూనియన్ కార్యాలయాన్ని తొలగించకుండా నిర్మాణాలు చేపట్టాలని కోరారు.

కిట్స్‌లో ముందస్తు సంక్రాంతి



వేడుకల్లో అధ్యాపకులు తదితరులు

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని సింగాపూర్ కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్ ఆధ్వర్యంలో శుక్రవారం ముందస్తు సంక్రాంతి వేడుకలు అంబరాన్నంటాయి. ఈసందర్భంగా కళాశాల డైరెక్టర్ కె.శంకర్ మాట్లాడుతూ, అన్ని పండుగలు పర్యావరణం, జీవావరణశాస్త్రం, ఐక్యత గురించి పాఠాలు నేర్పుతాయన్నారు. సుసంపన్నమైన సంప్రదాయాలు, సంస్కృతి, వారసత్వాన్ని రక్షించేందుకు యువతరం ఉత్సవాల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు. అనంతరం ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ఈశ్వరయ్య, స్టూడెంట్స్ యాక్టివిటీ సెంటర్ కోఆర్డినేటర్లు డాక్టర్ ఎ.కొమురయ్య, సీఎస్‌ఈ విభాగాధిపతి కల్లెం రవీంద్రబాబు, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.